
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 2 జూలై 2024



పుట్టపర్తి మండలంలోని గంగిరెడ్డిపల్లిలో ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ సమయంలో నెట్‌వర్క్ సమస్య తలెత్తింది. నడవలేని కొంతమంది లబ్ధిదారులను కుర్చీలో కూర్చోపెట్టుకుని, నెట్‌వర్క్ ఉన్నచోటుకి ఇలా.. తీసుకెళ్లారు. అక్కడ వేలిముద్రలు వేయించుకుని, పింఛన్ సొమ్ము అందజేశారు. పింఛన్‌పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

ఊరూరా.. జాతర..!!

పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ



- పాల్గొన్న మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు
- చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు
- పండుటాకుల పరమానందం
- చంద్రన్నకు రుణపడి ఉంటామంటూ కన్నీళ్లు
- మొదటిరోజు 91 శాతం పూర్తి



గోరంట్ల మండలం పాలసముద్రం గ్రామంలో పింఛన్ లబ్ధిదారులతో కలిసి మంత్రి సవిత సంబరాలు



అగళి మండలంలో పింఛన్ సొమ్ముతో లబ్ధిదారుల ఆనందం

పుట్టపర్తి, జూలై 1: పండుటాకుల మోములో నవ్వులు విరబూశాయి. వితంతు మహిళలకు ధైర్యం నింపింది. మంచానపడ్డ వారిలోనూ ఇక, ఏ ఒక్కరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేదన్న భరోసా నింపింది. అదే ఎన్టీఆర్ భరోసా పింఛన్. ఊరూరా పండుగ వాతావరణంలో పింఛన్ పంపిణీ ప్రక్రియ కొనసాగింది. జాతరను తలపించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పెంచిన పింఛన్‌తోపాటు గత మూడు నెలలది కలిపి ఇవ్వడంతో లబ్ధిదారుల్లో సంబరాల్లో మునిగిపోయారు. కొందరైతే కన్నీళ్లు పెట్టుకున్నారు. కన్నబిడ్డలే తమను పట్టించుకోని ఈ రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దకొడుకులా తోడుగా నిలుస్తున్నారని ఉద్వేగంగా చెప్పారు. చంద్రన్నకు రుణపడ్డామన్నారు.

రెట్టింపైన పింఛన్ సొమ్ము

2019 ఎన్నికలకు ముందు అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్.. తాము అధికారంలోకి వస్తే.. పింఛన్ సొమ్మును రూ.2 వేల నుంచి రూ.3 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో వైసీపీ గెలుపొంది, జగన్ సీఎం పీఠాన్ని అధిరోహించారు. పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచుతామన్న మాట మాత్రం తప్పారు. ఏటా రూ.250 చొప్పున పెంచుతామన్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రూ.2 వేలున్న పింఛన్ సొమ్మును రూ.3 వేలకు పెంచడానికి ఐదేళ్ల తీసుకున్నారు. ఎన్నికలకు కొన్ని నెలల ముందు రూ.3 వేలకు పెంచింది.

చంద్రన్న మాట ఇచ్చారు.. అమలు చేశారు..

ఇటీవల నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలకు ముందు కూటమి అధికారంలోకి రాగానే పింఛన్ సొమ్ము పెంచుతామని హామీ ఇచ్చారు. వృద్ధాప్య, వితంతు పింఛన్ సొమ్మును రూ.3 వేల నుంచి రూ.4 వేలు చేస్తామన్నారు. అంతేకాదు, ఏప్రిల్ నుంచే అమలు చేస్తామన్నారు. కూటమికి ప్రజలు పట్టంకట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి పీఠం అధిరోహించారు. ఆ వెంటనే ఇచ్చిన హామీని అమలు చేశారు. మొదటి నెల పెంచిన పింఛన్ రూ.4 వేలతో పాటు, గత మూడు నెలలకు రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.7 వేలు పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు సోమవారం లబ్ధిదారులకు అందజేశారు కూడా. జిల్లాలో 2,70,966 మందికి రూ.184.70 కోట్లు పంపిణీ చేస్తోంది.

పండుగలా..

జిల్లావ్యాప్తంగా పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. ఉదయం ఆరుగంటలకే మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవితతో పాటు ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యేలు, అధికారులు లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి పింఛన్‌పంపిణీ చేశారు. వృద్ధులు, వితంతువులకు ఒక్కసారిగా రూ.7వేలు అందజేయడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇంత డబ్బు వస్తుందని కలలో కూడా ఊహించుకోలేదంటూ ప్రజాప్రతినిధులు, నాయకుల ముందు చెప్పారు.

ఎవరెక్కడ..?

వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధర్మవరం పట్టణంలో ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, పంఛన్ల పంపిణీని ప్రారంభించారు. అనంతరం రూరల్ పరిధి నాగలూరు, బత్తలపల్లి మండలంలోని వేల్పుమడుగులో పంపిణీ చేశారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్పతో కలిసి సోమందేపల్లిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీ పార్థసారధి రొద్దం మండలంలోని స్వగ్రామం ఆర్‌మరువపల్లిలో పింఛన్ సొమ్ము అందజేశారు. మడకశిర నియోజకవర్గంలోని కదిరిసానిపల్లిలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎంపీ బీకే పార్థసారధి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ పింఛన్లను పంపిణీ చేశారు. కొత్తచెరువులోని బీసీ కాలనీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పింఛన్లను పంపిణీ చేశారు. కదిరి మున్సిపల్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పింఛన్ అందజేశారు. హిందూపురం పరిధి కొట్నూరులో జేసీ అభిషేక్‌కుమార్ పింఛన్లు అందజేశారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, పింఛన్ల పంపిణీ చేపట్టారు. గోరంట్లలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప పింఛన్ల పంపిణీని ప్రారంభించారు.

91 శాతం పంపిణీ..

జిల్లాలో కూటమి ప్రభుత్వం పింఛన్ల పంపిణీని పండుగలా నిర్వహించారు. సోమవారం జిల్లావ్యాప్తంగా 2,70,966 మంది లబ్ధిదారులకు రూ.184.70కోట్లు నిధులు విడుదలయ్యాయి. తొలి రోజు రాత్రి 8 గంటల వరకు 2,46,566 మందికి పింఛన్ సొమ్ము అందజేశారు. 91 శాతం పంపిణీ పూర్తి చేశారు.



హిందూపురంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి నందమూరి వసుంధరాదేవి క్షీరాభిషేకం

పెంచిన పింఛన్ తీసుకుంటూ..

శతాధిక వృద్ధుడి మృతి | మానవత్వం చూపిన ఎమ్మెల్యే సింధూరారెడ్డి | పింఛన్ సొమ్ముతోపాటు ఆర్థికసాయం అందజేత

బుక్కపట్నం: పెంచిన పింఛన్ సొమ్ము తీసుకుంటూ మండలంలోని లింగప్పగారిపల్లికి చెందిన శతాధిక వృద్ధుడు గాజుల వెంకటరాముడు (105) సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి వెంకటరాముడి మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆ కుటుంబం పట్ల మానవత్వం చూపారు. పింఛన్ సొమ్ము రూ.7 వేలను వృద్ధుడి భార్య లక్ష్మమ్మకు అందజేశారు. మరింత ఆర్థికసాయం పంపిణీ చేశారు. ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వెంకటరాముడుకు ఇద్దరు కుమారులు. వారికి వివాహాలు చేయడంతో వేరుగా ఉంటున్నారు. వెంకటరాముడు, లక్ష్మమ్మ కలిసి ఉండేవారు. పేద కుటుంబం. వృద్ధులకు పింఛన్ సొమ్మే ఆధారం. పింఛన్ పెంచడంతో ఆర్థిక కష్టాల నుంచి ఉపశమనం లభిస్తుందని సంబరపడ్డారు. ఆ సొమ్ము తీసుకుంటూనే వృద్ధుడు మరణించడం పట్ల స్థానికులు కంటతడి పెట్టుకున్నారు.



వెంకటరాముడు భార్య లక్ష్మమ్మకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న దృశ్యం

లారీల ఢీ

అదుపుతప్పి ఇళ్లలోకి దూసుకెళ్లిన లారీ
డ్రైవర్ మృతి
ముగ్గురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

తనకల్లు, జూలై 1: మండలంలోని పరాకువాండ్లపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున లారీలు ఢీకొన్నాయి. ఒకరు మృతిచెందగా.. ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లా ఎర్రగుంట్ల నుంచి బెంగళూరుకు సిమెంటు తరలిస్తున్న లారీ, మదనపల్లి నుంచి టైల్స్‌తో అనంతపురం వెళ్తున్న మరో లారీ పరాకువాండ్లపల్లి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదం అనంతరం అదుపు తప్పిన సిమెంటు లారీ కొంతదూరం ముందుకెళ్లి రోడ్డు పక్కనే ఉన్న సలీం ఇంట్లోకి దూసుకెళ్లింది. ఇంటి ముందు వైపునే టీకొట్టు నిర్వహణకు ఏర్పాటు చేసుకున్న గోడలు, పక్కనే ఉన్న నాగేంద్రరెడ్డి ఇంటిని ఢీకొంది. ప్రమాదం జరిగే ముందు వరకు నాగేంద్ర రెడ్డి ఇంటి ముందువైపున నిద్రిస్తున్న మహిళ లేచి అప్పుడే మూత్ర విసర్జనకు వెళ్లింది. దీంతో ప్రమాదం నుంచి బయటపడింది. ప్రమాదంలో గాయపడిన రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్లను 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సిమెంటు లారీ డ్రైవర్ మహమ్మద్ సోఫ్రాన్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మిగిలిన ముగ్గురు కదిరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతిచెందిన మహమ్మద్ సోఫ్రాన్ అన్నమయ్య జిల్లా కొత్తకోట మండల కేంద్రం వాసి అని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు వస్తే వివరాలు తెలుస్తాయన్నారు. ప్రమాద స్థలాన్ని ఎస్‌ఐ ధరణీబాబు పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఇళ్లలోకి దూసుకెళ్లిన లారీ



కొత్తచెరువు సచివాలయం-1లో మూలనపడ్డ నీటి పరీక్ష కిట్లు

నీళ్లొదిలారు..!

నీటి శుద్ధి పరీక్షలకు తిలోదకాలు

- ఏడాదిన్నర క్రితమే సచివాలయాలకు కిట్ల సరఫరా
- పట్టించుకోని ఇంజనీరింగ్ సహాయకులు
- పర్యవేక్షణ మరచిన ఉన్నతాధికారులు
- నిరుపయోగంగా కిట్లు
- గ్రామీణుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం



కొత్తచెరువు, జూలై 1: గత వైసీపీ పాలనలో గ్రామీణులకు శుద్ధినీటి సరఫరా మాటలు నీటి మూటలయ్యాయి. తాగునీటి పరీక్షలు కూడా చేయలేకపోయారు. తద్వారా గ్రామీణులు ఆరోగ్యంపై తీవ్ర నిర్లక్ష్యం చూపారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలన్న ఉద్దేశంతో సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నీటి పరీక్షా కిట్లను అందించింది. వారు క్షేత్రస్థాయిలో తమ పరిధిలోని తాగునీటి ట్యాంకుల్లో నీటిని పరీక్షించి, అందులో ఏయే లవణాలు అధికంగా ఉన్నాయి, ఫ్లోరిన్ అధికంగా ఉందా.. లేదా.. అని పరీక్షించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఆ నీరు సురక్షితమా, కాదా అని తేల్చాల్సిన ఆవశ్యకత ఉంది.

గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు నీటి పరీక్షా కిట్లను సరఫరా చేసింది. వారికి ప్రభుత్వ గృహనిర్మాణాల బాధ్యతను అప్పజెప్పి, లక్ష్యాలు విధించి, ఒత్తిడి తెచ్చింది. దీంతో వారు ప్రభుత్వ గృహ నిర్మాణాలపైనే ఎక్కువగా దృష్టి సారించారు. తాగునీటి పరీక్షల అంశాన్ని పక్కనపెట్టేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ తాగునీటిని వినియోగిస్తుండటం కారణంగా ప్రజలు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారు. భూమి లోపల అధిక లోతు నుంచి వచ్చే తాగునీటిని ప్రజలు తాగి అనారోగ్యంతోపాటు ఫ్లోరిన్ బారిన పడి కాళ్ల నొప్పులు, ఒళ్లునొప్పులతో ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారుల్లో ఎదుగుదలలోపం కనిపిస్తోంది. గ్రామాల్లో రోజూ నీటి పరీక్షలు నిర్వహించాలి. రోజూ ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామాలకు వెళ్లి మంచినీటి శాంపిళ్లను సేకరించి, ల్యాబ్‌కు తీసుకురావాలి. ల్యాబ్‌లో రోజూ రెసిడ్యూయల్ క్లోరిన్ (ఆర్‌సీ) టెస్టు నిర్వహించాలి. నెలకోసారి మంచి నీటి నాణ్యత ప్రధాన పరీక్ష నిర్వహించాలి. ఇందులో 13 రకాల అంతర్గత పరీక్షలుంటాయి. 15 రోజులకోసారి ట్యాంకును శుభ్రం చేయించాలి. ఇది పంచాయతీ సహకారంతో చేయాల్సిన పని. వీటికి సంబంధించి గ్రామీణ నీటి సరఫరా విభాగం రికార్డులను నిర్వహించాల్సి ఉంటుంది. ట్యాంకులను శుభ్రం చేయకపోయినా.. చేసినట్లు రికార్డుల్లో నమోదు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. మంచినీరు సరఫరా చేసే సమయంలో పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.



ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. పంచాయతీ తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. తద్వారా అంటువ్యాధులను అరికట్టవచ్చు. ఫ్లోరైడ్ నీటితో మోకాళ్ల నొప్పులు, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

- గంగాదేవి, తలమర్ల, కొత్తచెరువు మండలం



ఈ కిట్లకు మోక్షమెన్నడో..?

వృథాగా కిట్లు

జిల్లాలోని సచివాలయాలకు ఏడాదిన్నర క్రితమే నీటి పరీక్ష కిట్లను సరఫరా చేశారు. ఒక్కో కిట్టు ధర రూ.1300 ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 465 గ్రామ సచివాలయాలున్నాయి. మేజర్ పంచాయతీ సచివాలయాలకు 10, చిన్న వాటికి 2 చొప్పున సరఫరా చేశారు. అవి వచ్చాయే తప్ప.. వినియోగించింది లేదు. అలానే మూలనపడేశారు. అలా.. ప్రజాధనం వృథా చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటవడంతో మళ్లీ ఆర్వో ప్లాంట్లు తెరుచుకుంటాయనీ, శుద్ధిజలం సరఫరా చేస్తారని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మోకాళ్ల నొప్పులు వచ్చాయి



ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల నాకు మోకాళ్లు, కీళ్ల నొప్పులు వచ్చాయి. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకున్నా డబ్బులు ఖర్చయ్యాయే తప్ప.. ప్రయోజనం లేదు. అధికారులు స్పందించి ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరించాలి.

- వెంకటసురేంద్ర, కోటిరెడ్డిపల్లి, ముదిగుబ్బ మండలం

నీటి పరీక్షలు ఎక్కడ?

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి పరీక్షలను సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు ఎప్పటికప్పుడు నిర్వహించాల్సి ఉంది. వారు ఎక్కడా చేసిన దాఖలాల్లేవు. ఫ్లోరైడ్, ఇతర హానికర లవణాలున్న నీటిని గ్రామీణ ప్రాంత ప్రజలు వినియోగిస్తుండటం కారణంగా పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తాగునీటి పరీక్షలు నిర్వహించి శుద్ధినీటిని గ్రామీణ ప్రజలకు అందించాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ హయాంలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రతి గ్రామానికి శుద్ధిజలం అందించాలన్న లక్ష్యంతో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో మూతపడ్డాయి. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు పంచాయతీ బోర్ల ద్వారా వచ్చే నీటిని వినియోగిస్తుండటంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని శుద్ధిజల ప్లాంట్లను వినియోగంలోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాం

మంచినీటి పరీక్షల కిట్లను సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులకు అందజేశాం. వారు పని ఒత్తిడి కారణంగా నీటి పరీక్షలు నిర్వహించలేకపోతున్నారు. ఇప్పటికే నీటి పరీక్షలపై అవగాహన కల్పించాం. క్షేత్రస్థాయిలో వారి పరిధిలోని నీటి ట్యాంకుల్లోని నీటిని పరీక్షించి, నివేదిక అందించాల్సి ఉంది. వాటి ఆధారంగా ప్రజలకు శుద్ధినీటిని అందించేలా చర్యలు తీసుకుంటాం.

- ఇక్బాల్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్

స్కాలర్‌షిప్ దరఖాస్తుకు ఓటీఆర్ తప్పనిసరి

కొత్తచెరువు, జూలై 1: కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ 2024-25 విద్యాసంవత్సరం నుంచి నేషనల్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు ఓటీఆర్ (వన్‌టైమ్ రిజిస్ట్రేషన్) తప్పనిసరి చేసిందని జిల్లా పరీక్షల విభాగాధికారి లాజర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఓటీఆర్ నంబర్ లేనిదే స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండదన్నారు. ఓటీఆర్ నంబరుతో ఫేస్‌యాప్ ద్వారా వారి మొబైల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మొబైల్‌లేని వారు ఇతరులకు సంబంధించిన వారి దాని నుంచైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఓటీఆర్ నంబర్ పొందిన విద్యార్థులు ఎన్‌ఎస్‌పీ పోర్టల్‌లో నేరుగా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

పుట్టపర్తి, జూలై 1: సకాలంలో వేతనాలు చెల్లించాలంటూ జిల్లాలో పనిచేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు సోమవారం స్థానిక కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. యూనియన్ నాయకుడు అశోక్ మాట్లాడుతూ.. కార్మికులకు కేవలం రూ.6 వేలు వేతనం ఇస్తున్నారన్నారు. దీనిని పెంచాలని కోరారు. వేతన బకాయిలను వెంటనే చెల్లించాలనీ, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్వో కొండయ్యకు వినతిపత్రం అందజేశారు.



కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ఆనందం కనిపించెన్..!

పింఛన్ లబ్ధిదారుల్లో వెల్లివిరిసిన సంతోషం

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరిగింది. ఉదయమే మంత్రులు, ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బకాయిలు సహా పెంచిన పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారని ప్రశంసించారు. పలు ప్రాంతాల్లో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పింఛన్ అందజేసిన నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటామని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.



మాట నిలబెట్టుకున్నారు

ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకున్నారు. గతంలో మాదిరిగా రూ.250లు చొప్పున కాకుండా, ఒకేసారి రూ.1000లు పెంచడం గొప్ప విషయం. రూ.4వేలతో పాటు, బకాయిలు కలిపి రూ.7లు పింఛన్ అందుకున్నా.

- వెంకన్న, ఉరవకొండ



రుణపడి ఉంటాం

అనంతపురం అర్బన్, జూలై 1: నా మేనల్లుడు సుధీర్ విభిన్న ప్రతిభావంతుడు. చంద్రబాబునాయుడు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు విభిన్న ప్రతిభావంతుడైన నా మేనల్లుడికి రూ.ఆరు వేలు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చారు. ఇలాంటివారిపై కనికరం చూపి పింఛన్ సొమ్ము పెంచి ఇస్తున్న చంద్రబాబుకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

- రామలక్ష్మి, విభిన్న ప్రతిభావంతుడు సుధీర్ మేనత్త, వెంకట్రావ్ నగర్, అనంతపురం



ఆర్థిక సమస్యలు తీరుతాయి

ధర్మవరం: పింఛన్ సొమ్ముతోనే నేను, నాభార్య జీవిస్తున్నాం. గతంలో ఇచ్చే పింఛన్ డబ్బులతో కుటుంబపోషణ, మందులు, నిత్యావసర సరుకులకు డబ్బులు చాలక ఇబ్బందులు పడేవాళ్లం. ఇలాంటి సమయం లో సీఎం చంద్రబాబు రూ.నాలుగు వేలు పింఛన్ ఇవ్వడంతో ఆర్థికంగా కొన్ని సమస్యలు తీరుతాయి.

- అబ్దుల్ అజీజ్, వృద్ధుడు, ముదిగుబ్బ మండలం



మంత్రితోపాటు పింఛన్ పంపిణీలో పాల్గొన్న కలెక్టర్, అనంతపురం నగరపాలక కమిషనర్

మాది చేతల ప్రభుత్వం: మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ,జూలై1: మాది మాటల ప్రభుత్వం కాదు. చేతల ప్రభుత్వమని ఆర్థిక శాఖ మంత్రి మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. పట్టణంలోని పాతపేటలో సోమవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ వినోద్ కుమార్, అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్ మేఘా స్వరూప్ పాల్గొన్నారు. అంతకుమునుపు మంత్రి స్వగ్రామం కౌకుంట్లలో పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.



ధర్మవరంలో పింఛన్ అందజేస్తున్న మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్, చిలకం మధుసూదన్ రెడ్డి

వివక్ష చూపం: మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం: వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సామాజిక భద్రతా పింఛన్లు అందజేస్తామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన నియోజకవర్గంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ఇచ్చిన మాట మేరకు పింఛన్ సొమ్మును పెంచడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.



పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి సవిత, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

మాట నిలబెట్టుకున్నాం: సవిత, మంత్రి

హిందూపురం(సోమందేపల్లి): ఎన్నికల హామీ మేరకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెలబెట్టుకున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్నేహలతనగర్‌లో సోమవారం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆమె మాట్లాడుతూ జగన్ అధికారంలో ఉన్నప్పుడు రూ.3వేలు పెన్షన్ ఇస్తామని చెప్పి ఐదేళ్లపాటు కొద్దికొద్దిగా పెంచుకుంటూ పోయి జనాన్ని మోసం చేశారన్నారు.



కొత్తచెరువు బీసీకాలనీలో పింఛన్ డబ్బు అందిస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె, అధికారులు

పింఛన్‌దారులకు ముందుగానే ఏకాదశి

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

కొత్తచెరువు: పింఛన్ల సొమ్ము పెంచి బకాయిలతో కలిపి రూ. ఏడు వేలు ఇవ్వడంతో పింఛన్‌దారులకు ముందుగానే తొలి ఏకాదశి వచ్చినట్లుందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బీసీకాలనీలో సోమవారం వీరు పింఛన్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ దేశంలో సామాజిక భద్రత పింఛన్ అమలు చేసిన ఘనత టీడీపీకి, దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం చంద్రబాబు కూడా ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పేదల సంక్షేమానికి పాటుపడుతున్నాడని కొనియాడారు.



వృద్ధుడికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

చంద్రబాబు.. దేవుడితో సమానం: ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం: పింఛన్ల పెంపుతో లబ్ధిదారులు సీఎం చంద్రబాబునాయుడును దేవుడితో సమానంగా చూస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేశారు. ఆయా మండలాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పెంపునకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమన్నారు. పెంచిన పింఛన్ల పంపిణీతో పల్లెల్లో పండగ వాతావరణం ఏర్పడిందన్నారు.



రాప్తాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న పరిటాల సునీత

అర్హులందరికీ పింఛన్లు: ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు: అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలకేంద్రంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఈ నెల రూ. 7 వేలు పింఛన్ అందించి మాట నిలుపుకున్నారన్నారు. పింఛన్ సొమ్ము పెంచడంతో లబ్ధిదారుల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అర్హులైనా తమకు పింఛన్ రాలేదని ఎంతో మంది తమ వద్ద ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. వారందరికీ కూడా పార్టీలకతీతంగా పింఛన్లు పునరుద్ధరిస్తామన్నారు.

బాధ్యత పెరిగింది

వసుంధరాదేవి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి



దేమకేతేపల్లిలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న నందమూరి వసుంధరాదేవి

చిలమత్తూరు: తమ కుటుంబానికి హ్యాట్రిక్ విజయం అందించిన హిందూపురం నియోజకవర్గం పట్ల బాధ్యత మరింత పెరిగిందని ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరాదేవి పేర్కొన్నారు. మండలంలోని దేమకేతేపల్లిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సోమవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్రం అభివృద్ధి సంక్షేమం వైపు అడుగులు వేస్తోందని ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. చంద్రబాబునాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి కావడం ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు.

దిక్కులేనివారికి దేవుడయ్యాడు



ట్రాక్టర్ ప్రమాదంలో నా వెన్నెముక విరిగిపోయింది. మంచాన పడ్డా. నా భార్య కూలి పనికిపోతేనే మా కుటుంబం గడిచేది. ఎప్పుడైనా కూలిపనికి పోకపోతే నాకు, నా కుమారుడికి పస్తులే. ఆరోగ్యం బాగోలేనప్పుడు వైద్యం చేయించుకోవడానికి కూడా లెక్కలేక ఇబ్బంది పడే వాళ్లం. మంచం దిగలేను ... నడవలేను. ఇలాంటి కష్ట సమయంలో చంద్రన్న పింఛన్‌ను రూ.ఐదు వేల నుంచి రూ.15 వేలకు పెంచి మాలాంటి దిక్కులేని వాళ్లకు దేవుడయ్యాడు.

చాకలి నాగరాజు, ఎనుమలపల్లి, శ్రీసత్యసాయి జిల్లా

డబుల్ హ్యాపీ: అజిత్, యాడికి



చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో చెప్పినట్లు ఈరోజు రూ.15వేలు పింఛన్ అందజేశారు. పింఛన్ సొమ్ము పెరగడంతో డబుల్ హ్యాపీగా ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, టీడీపీ ప్రభుత్వానికి మేమంతా రుణపడి ఉంటాం.



గాండ్లపెంటలోని ఎస్సీ కాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న కందికుంట

తలెత్తుకుని జీవించాలనే..: ఎమ్మెల్యే కందికుంట

కదిరి: వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు సమాజంలో తలెత్తుకుని జీవించాలనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందిస్తున్నామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఉదయం 6గంటల నుంచి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ఆలయం వెలుపల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకిచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పింఛన్ సొమ్ము పెంచి పంపిణీ చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయలేరని ప్రచారం చేసిన వారికి ఇది ఒక గుణపాఠమన్నారు.



మడకశిర మండలం మరువపల్లి వద్ద పత్తిపొలంలో పనిచేస్తున్న కూలీకి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

చంద్రబాబుదే ఘనత: ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్: మొదటి నెలలోనే ఎన్నికల హామీని అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా పేదల సంక్షేమానికి చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛన్‌ను బకాయిలతో కలిపి అందజేసినట్లు వెల్లడించారు.



గుంతకల్లులో లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే జయరాం

చంద్రబాబుకు అండగా నిలవండి: ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు: సంక్షేమానికి మారుపేరైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజలంతా అండగా నిలవాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. మండలంలోని కసాపురం గ్రామంలో సోమవారం ఉదయం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం మొదలుకుని ఇప్పటి వరకూ రాష్ట్రంలో చిరస్థాయిగా నిలిచిపోయే ఎన్నో సంక్షేమ పథకాలను టీడీపీ ప్రవేశపెట్టిందన్నారు. ఈ ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలన్నింటినీ తప్పక నెరవేరుస్తారన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

పేదింటి పండుగ: బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే

నార్పల: పేదింటి పండుగ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అభివర్ణించారు. మండలంలోని బీ పప్పూరు గ్రామంలో సోమవారం ఆమె టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడుతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ మొత్తాన్ని అందజేశారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.



దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

చంద్రబాబు అంటేనే నమ్మకం: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం అర్బన్: సీఎం చంద్రబాబు మాట ఇస్తే తప్పేది ఉండదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని పాతూరులో సోమవారం ఉదయం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పింఛన్ల పంపిణీతో రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణం ఏర్పడిందన్నారు.



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

చరిత్రలో నిలిచిపోతుంది: ఎంపీ పార్థసారథి

హిందూపురం: ఇంత పెద్దమొత్తంలో పింఛన్లు ఇవ్వడం దేశ చరిత్రలో నిలిచిపోయే ఘనత అని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి అన్నారు. రొద్దం మండలం మరువపల్లిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు వారి కుటుంబాలకు భారం కాకూడదనే సీఎం చంద్రబాబు పింఛన్ మొత్తాన్ని పెంచి ఇచ్చారన్నారు.



పింఛన్ల పండుగ నేపథ్యంలో ఢిల్లీలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

పేదింటి పెద్దకొడుకు చంద్రబాబు



గార్లదిన్నె: ఎన్నికల సమయంలో ఏప్రిల్ నెల నుంచే రూ. నాలుగు వేలు పెన్షన్ ఇస్తానన్న మాట ప్రకారం ఈరోజు రూ. ఏడువేలను అందించి చంద్రబాబు మాట నిలబెట్టుకున్నాడు. పింఛన్ తీసుకునే మాలాంటి పేదిళ్లకు పెద్దకొడకయ్యాడు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

- అనసూయమ్మ, గార్లదిన్నె

వైద్యం చేయించుకుంటా..



కళ్యాణదుర్గం: చంద్రబాబునాయుడు ఈ నెల ఒకేసారి రూ. ఏడు వేలు పింఛన్ ఇచ్చాడు. దీంతో వైద్యం చేయించుకుంటా. ఈ డబ్బు వైద్యఖర్చులతో పాటు మందులకు కూడా సరిపోతుంది. పింఛన్లను పెంచి మాలాంటి వృద్ధులను ఆదుకున్న చంద్రబాబుకు రుణపడి వుంటాం. ఉద్యోగస్థులతో సమానంగా ఇంత మొత్తం రావడం సంతోషంగా వుంది.

- వెట్టిలింగమ్మ, చెన్నంపల్లి, కంబదూరు మండలం

ఇక.. కుటుంబానికి భారంకాను



హిందూపురం: నాకు 66ఏళ్ల వయసు, 25ఏళ్ల కిందటే పక్షవాతం వచ్చి మంచానపడ్డా. అప్పటి నుంచి నా కుటుంబానికి భారంగా మారా. ఈక్రమంలోనే చదివించే స్థోమత లేకపోవడంతో నా ఒక్కగానొక్క కుమారుడు చదువు మానేసి టైల్స్ పనికి వెళ్తున్నాడు. నా భార్య కూలి పనిచేసి ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసింది. ప్రతినెలా నా మందులకు రూ.7వేల నుంచి రూ.8వేల దాకా ఖర్చయ్యేది. ప్రభుత్వం నాకు రూ.5వేలు మాత్రమే ఇచ్చేది. దీనివల్ల ప్రతినెలా రూ.3వేల దాకా నా కుమారుడు, భార్య పని చేసి ఇచ్చేవారు. మహానుభావుడు చంద్రబాబు పుణ్యమా అంటూ రూ.15వేలు ఇచ్చాడు. దీంతో ఇక నుంచి రూ.7వేలు మిగులుతుంది. నా కుటుంబానికి నేను భారం కాను.

- నరసింహమూర్తి, పూలకుంట, హిందూపురం

మా జీవితంలో వెలుగులు చంద్రబాబు చలవే..



రాప్తాడు: నాకు చిన్నప్పుడే పోలియో సోకడంతో నడవడానికి చేత కాదు. ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నా. నాకు భార్య, కుమారుడు ఉన్నాడు. భార్య కూలి పనికి వెలుతుంది. కుమారుడు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాడు. గత ప్రభుత్వంలో రూ. 5 వేలు పింఛన్ వచ్చేది. నేను నడవడానికి వీలు లేకపోవడం వలన ఏ పని చేయలేను. ఆ డబ్బుతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. ఈ రోజు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి రూ. 15 వేలు పింఛన్ అందచేశారు. ఇక నుంచి ప్రతి నెలా నాకు రూ. 15 వేలు పింఛన్ వస్తుంది. ఇప్పుడు నా కుటుంబ పోషణకు ఎటువంటి ఇబ్బంది లేదు. దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు చంద్రబాబునాయుడు. ఆయన రుణం తీర్చుకోలేనిది.

- జానకిరామయ్య, దివ్యాంగుడు, రాప్తాడు


చిగిచెర్లలో జడ్పీ మాజీ చైర్మన్ చిగిచెర్ల ఓబిరెడ్డి


మోటుమర్లలో మాజీ ఎంపీపీ మద్దిలేటి


పోతుకుంటలో మాజీ ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి


ఉప్పునేసినపల్లిలో సీఎం చిత్రపటానికి సర్పంచ్ ముత్యాలప్పనాయుడు క్షీరాభిషేకం

అట్టహాసంగా పింఛన్ల పండుగ

పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు


రెడ్డిపల్లిలో పింఛన్ పంపిణీని పర్యవేక్షిస్తున్న డీఈఓ మీనాక్షి


పి.కొత్తపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ కళావతి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : సామాజిక పింఛన్ల పంపిణీని ఓ పండుగలా.. సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ఇందులో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరా, ప్రముఖ నేతలు పాల్గొన్నారు. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ధర్మవరం పట్టణంలోని 19, 35, 36, 6,7 వార్డుల లో, మండలంలోని నాగలూరులో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ధర్మవరం నియోజక వర్గ వ్యాప్తంగా 48,022 మందికి పింఛన్‌లను పంపిణీ చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అలాగే ధర్మవరంరూరల్ మండలంలోని నాగులూరు గ్రామంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌తో కలిసి పింఛన్లు అందజేశారు.

కదిరి ఎమ్మెల్యే కందికుంట ఆధ్వర్యంలో..
కదిరిఅర్బన్ మండలంలోని కుమ్మరవాండ్లపల్లిలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పింఛన్లు పంపిణీ చేశారు. నంబులపూలకుంట మండలంలోని తూర్పునడింపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో, నల్లచెరువు ఎంపీడీఓ కార్యాలయం వద్ద గాండ్లపెంట ఎంపీడీఓ కార్యాలయం ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పింఛన్ల పంపిణీ చేశారు. తనకల్లులో గుజిరీ అక్బర్ పక్షవాతం సోకి కదలేని స్థితిలో మంచానికే పరిమితమయ్యారు. ఎమ్మెల్యే అతని ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేశారు.

పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర ఆధ్వర్యంలో..
పుట్టపర్తి జిల్లా కేంద్రంలోని ఎనుమలపల్లిలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అలాగే కొత్తచెరువులోని బీసీకాలనీలో, అమడగూరులో, నల్లమాడ మండలంలోని రాగానిపల్లి, గోపేపల్లి, చౌటకుంటపల్లి తదితర గ్రామాల్లో, బుక్కపట్నం, ఓబుళదేవరచెరువులోని బీసీ కాలనీలో వీరు పింఛన్ల పంపిణీ చేశారు.

నల్లమాడ మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మండల స్పెషలాఫీసర్, డీఈఓ మీనాక్షి పర్యవేక్షించారు. రెడ్డిపల్లి, వేళ్లమద్ది, వంకరకుంట, ఎర్రవంకపల్లి పంచాయతీల్లో ఆమె పర్యటించారు. తాడిమర్రి మండలంలోని ఏకపాదంపల్లి గ్రామంలో టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. శివంపల్లి గ్రామంలో పెద్దకుళ్లాయరెడ్డి ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. ముదిగుబ్బ బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నంబులపూలకుంట మండలంలో పింఛన్లను సచివాలయ సిబ్బంది, అధికారులు, ఎన్‌డీఏ కూటమి నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేంద్రకుమార్, ఈఓఆర్‌డీ మనోహర్ బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌డీఓ కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఏకపాదంపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, టీడీపీ కన్వీనర్


కప్పలబండలో పింఛన్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ చిన్నపెద్దన్న


వేల్పుమడుగులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


శివంపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు


ముదిగుబ్బలో కేక్ కట్ చేస్తున్న నాయకులు


కప్పలబండలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


లోచర్ల పెద్దారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

లోచర్ల పెద్దారెడ్డికి ఘన నివాళి

పుట్టపర్తి, జూలై 1: కమ్యూనిస్టు నేత పెద్దారెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రశాంతిగ్రామం సమీపంలోని పెద్దారెడ్డి కాలనీలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాన్ని తృణప్రాయంగా వదులుకుని కమ్యూనిజం సిద్ధాంతాలకు ఆకర్షితుడై తన జీవితమంతా పేదల సేవకే వెచ్చించిన మహనీయుడు లోచర్ల పెద్దారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో లోచర్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ రత్నప్పచౌదరి, శ్రీరామిరెడ్డి, మాజీసర్పంచ్ చంద్రశేఖర్, ఆవుల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పోస్టు భర్తీ చేయాలని వినతి

ఓబుళదేవరచెరువు: ఉర్దూ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలని సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిని మైనార్టీ నిరుద్యోగ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రంలో పింఛన్ పంపిణీకి హాజరైన ఎమ్మెల్యేకి వారు వినతి పత్రం అందజేశారు. ఆ సంఘం నాయకుడు బికెన్ షా మాట్లాడుతూ.. 2024 మెగా డీఎస్సీలో ఉర్దూ అసిస్టెంటు పోస్టులు సూచించాలని, తద్వారా నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని అన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్‌లాజం విజ్ఞప్తి చేశారు. 117 జీవో రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలు పరిష్కరించాలని, సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని, పీఆర్‌సీ ప్రకటించాలని, డీఎస్సీలో బ్లాక్‌లాంగ్‌లో ఉర్దూ మీడియంలో ఓపెన్ క్యాటగిరి వారికి వర్తింపచేయాలని ఎమ్మెల్యేకి వినతిపత్రం అందించారు. ఆయన వెంట భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ధర్మవరం, జూలై 1: పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మద్యాన్ని స్వాధీనం చేసుకొని.. ఆమెపై కేసు నమోదు చేశామన్నారు.

డయేరియా కట్టడిపై అవగాహన

ముదిగుబ్బ, జూలై 1: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా కట్టడిపై మండల వైద్యాధికారి రాజేంద్ర సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విరేచనాలు ఉన్న చిన్నారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు



నల్లచెరువు, జూలై 1: మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు డీఈఓ నరసింహరాజు, ఈఓ రవీంద్రరాజు తెలిపారు. పది నెలలకుగాను రూ.4,79,663 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తం బ్యాంక్‌లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి శుభాకాంక్షలు

ధర్మవరం రూరల్, జూలై 1: రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ధర్మవరం డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియాసాల్మన్, దర్శినమల పీహెచ్‌సీ వైద్యబృందం, సిబ్బంది సోమవారం మండలంలోని నాగలూరు గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రికి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట మండల వైద్యాధికారులు పుష్పలత, దిలీప్‌కుమార్, సిబ్బంది అంజనేయులు, ఏఎన్ఎంలు, ఆశాలు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాంకు ఉద్యోగి చేయూత


విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న బ్యాంకు ఉద్యోగి

ముదిగుబ్బ, జూలై 1 : మండలంలోని కొండగట్టుపల్లి, ఎస్ఎస్‌పి కొట్టాల, ముదిగుబ్బ పాఠశాలలలో చదువుతున్న సుమారు 60 మంది విద్యార్థులకు ముదిగుబ్బ యూనియన్ బ్యాంకు ఉద్యోగి చంద్రకళ సోమవారం తనవంతు సహాయంగా విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, నాగేంద్ర గౌడ్, అంజనేయులు నాయక్, శ్రీనివాసులు, తులసి పాల్గొన్నారు.

కదిరిఅర్బన్ : మండలంలోని బూరుగుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి హరిమోహన్ విద్యార్థులకు పలకలు, పెన్నులు, బ్యామెంట్రీ బాక్స్‌లు, అందించారు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా వాటిని అందజేశారు.

కదిరిని ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

ఎమ్మెల్యే కందికుంట.. మున్సిపల్ ఎక్స్ అఫీషియో మెంబరుగా ప్రమాణం


ఎక్స్‌అఫీషియో మెంబరుగా ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే

కదిరి, జూలై 1: కదిరి మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి పార్టీలకు అతీతంగా అందరం కలిసి కృషి చేద్దామని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు. సోమవారం మున్సిపాలిటీలో ఎక్స్‌అఫీషియో మెంబరుగా ఆయనతో వైస్ చైర్మన్ గంగాదేవి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాగునీరు, మురుగునీటి కాలువలు, విద్యుత్ లైన్లు తదితర వాటి గురించి భవిష్యత్‌తరం ఇబ్బందులు పడకుండా పనులు చేయాలన్నారు. పార్టీలు, వ్యక్తిగత అభిప్రాయాలు ఎన్నికల వరకే ఉండాలని, ఎన్నికల అనంతరం ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తామందరూ అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. ఎమ్మెల్యే ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా మున్సిపాలిటీకి వస్తే ప్రజాప్రతినిధులు హాజరుకాపోవడం తగదన్నారు. ఎంతోమంది యువ, సీనియర్ కౌన్సిలర్లు ఉన్నారని, అందరూ ఆలోచించి, మున్సిపాలిటీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని హితవుపలికారు. రానున్న రెండేళ్ల కాలంలో మున్సిపాలిటీని ఆదర్శంగా అభివృద్ధి చేద్దామన్నారు. ప్రస్తుత పాలకులు అభివృద్ధికి కలిసి రావాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం పలువురు ఎమ్మెల్యేని సన్మానించారు.

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం .. ప్రజాధనం వృథా


నిరుపయోగంగా ఉన్న మల్లెమీదపల్లి చెత్త సంపద కేంద్రం


రహదారి పక్కనే వదిలేసిన చెత్త తరలించే వాహనం

గాండ్లపెంట, జూలై 1: ప్రజాధనం రూ.లక్షల నిధులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలను పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారాయి. అవి కాస్త మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. ప్రతి సచివాలయ పరిధిలో చెత్త సంపద కేంద్రాలు నిర్మించారు. ఆయా సచివాలయ గ్రామాల్లోని వీధులు, ఇళ్లలో చెత్తను సేకరించడానికి పరిశుధ్య కార్మికులను నియమించారు. పారిశుధ్య కార్మికులు సేకరించిన చెత్తను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం వాహనాలు ఏర్పాటు చేసింది. వాటి ద్వారా చెత్తను సేకరించి కేంద్రాల్లో కంపోస్టు ఎరువులు తయారుచేసి, రైతులను విక్రయించాల్సి ఉంది. గ్రామాల్లో పరిశుభ్రం, వర్మీ కంపోస్టులకు మంచి డిమాండ్ ఉంది. అయినా వాటిని అమలు చేయడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రూ.లక్షల నిధులతో నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారడమే కాకుండా మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

పుట్టపర్తి, జూలై 1: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిస్కరించాలని డీఆర్ఓ కొండయ్య అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా 114 ఫిర్యాదులు స్వీకరించిన ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ, మున్సిపల్ అధికారుల తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం జిల్లా సర్వసభ్యసమావేశం ఉంటుందని, ఆయాశాఖల అధికారుల నివేదికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో వసుందర, సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ కమిటీ ఎంపిక

నంబులపూలకుంట, జూలై 1: మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు ఆధర్యంలో మండల కమిటీని సోమవారం ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా నాగరాజు, అధ్యక్షుడి శ్రీనివాసులు, కార్యదర్శిగా దర్బార్‌రెడ్డి, ట్రెజరర్‌గా బావాజీ, ఉపాధ్యక్షుడిగా ఖలందర్, సహాయ కార్యదర్శులుగా రెడ్డెప్ప, చలపతి నాయుడు, గోపాల్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు చెప్పారు.

నేడు విద్యావైజ్ఞానిక తరగతులు

ఓబుళదేవరచెరువు : సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్‌లో విద్యావైజ్ఞానిక తరగతులను నిర్వహిస్తున్నామని, వాటిని జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. సోమవారం వారు మాట్లాడుతూ.. ఈ తరగతులకు సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ హాజరవుతారని జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు రమణ, కుళ్లాయప్ప, శ్రీరాములు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం: డీఎస్పీ


బుక్కపట్నంలో మాట్లాడుతున్న డీఎస్పీ

బుక్కపట్నం, జూలై 1: చట్టాలపై ప్రతి ఒకరూ అవగాహన కలిగి ఉండాలని పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ పేర్కొన్నారు. సోమవారం బుక్కపట్నంలోని పోలీస్ స్టేషన్ నూతన చట్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమస్యాత్మక గ్రామల్లో పోలీసులతో ప్రజలు మమైకమై ఉండాలన్నారు. ఘర్షణలకు పోకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ సీఐ రాగిరి రామయ్య, బుక్కపట్నం, పుట్టపర్తి రూరల్ ఎస్ఐలు సురేష్‌బాబు, క్రిష్ణమూర్తి, ఏఎస్ఐ రమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ధర్మవరం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన చట్టాలపై విద్యార్థులకు ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సుబ్రమణ్యం అవగాహన కల్పించారు.

నల్లచెరువు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన చట్టాలపై ఎస్ఐ కేఎం లింగన్న, తహసీల్దార్ రవికుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాపరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, డ్రైవర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నల్లమాడ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రమేష్‌బాబు ఆటో డ్రైవర్లు, వాహనదారులు, స్థానికులు, విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు.


కేక్ కట్ చేస్తున్న బంగారు క్రిష్ణమూర్తి

ఘనంగా బంగారు క్రిష్ణమూర్తి జన్మదినం

కదిరిఅర్బన్, జూలై 1: రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బంగారు క్రిష్ణమూర్తి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆయన నివాసంలో కేక్ కట్ చేసి, ఆ సంఘం నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విజయలక్ష్మీ ఫౌండేషన్ ఛైర్మన్‌గా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

ధర్మవరం, జూలై 1: ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రాంకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మంత్రి సత్యకుమార్‌యాదవ్ పాల్గొంటారని, సమావేశానికి అధికారులందరూ పూర్తి వివరాలతో హాజరు కావాలని సూచించారు.

జోరుగా పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి రూరల్, జూలై 1 : మండలంలో మొత్తం 4,815 మంది పింఛన్‌దారులు ఉండగా.. 4315 మందికి పింఛన్లు (90%) పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మిగిలిన వారికి మంగళవారం పంపిణీ చేస్తామన్నారు.

నిరుద్యోగి ఆత్మహత్య


జయప్రకాష్‌రెడ్డి (ఫైల్)

బుక్కపట్నం: మండలంలోని తరుగువాండ్లపల్లిలో నిరుద్యోగి జయప్రకాష్‌రెడ్డి (24) సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. కళావతి, ప్రభాకరెడ్డి ఏకైక కుమారుడు జయప్రకాష్‌రెడ్డి . ఇతను డిగ్రీ చదివాడు. ఉద్యోగం రాలేదు. తన తండ్రి పెట్టిన మిరప పంటకు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. జీవితంపై విరక్తి చెందిన జయప్రకాష్‌రెడి సొంత పొలంలోని వేపచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రభాకరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647
AJA- 189272

GOLDEN OPPORTUNITY
Insurance Agents and Sale Managers
మీ స్వంత సేల్స్ టీం ని నియమించుకొని బిజినెస్ అభివృద్ధి చేసుకోండి మరియు ఆకర్షణీయమైన జీతంతో పాటు పెట్టుబడి లేకుండా వ్యాపారవేత్తగా మారే అవకాశం. సంప్రదించండి : అలెగ్జాండర్ లగ్జరీ హోటల్, సప్తగిరి సర్కిల్, అనంతపురము. ఇంటర్వ్యూ : తేది : 4 జూలై, 2024, మధ్యాహ్నం: 3 గం॥లకు. Register your Seat : 6364301913.
AJA-SREE

SALE/RENTAL
6.30 Acers Of LAND WITH 26000 SQFT AREA SHED AVAILABLE WITH COMPOUND WALL. NEXT TO BANGALORE - HINDUPUR. MAIN ROAD, HINDUPUR(M) Contact:9347064164.
AJA-189266

WANTED
HIV/ AIDS Prevention Project APSACS - RIDS Anantapur PU లో పనిచేయుటకు అభ్యర్థి కావలెను. MEA- మానిటరింగ్ మరియు ఎవాల్యుయేషన్ ఆఫీసు కమ్ అకౌంటెంట్‌గా చేయుటకు అభ్యర్థి కావలెను. అర్హత: B.Com కంప్యూటర్, Graduation in Mathematics, Statistics & Commerce. Email ID: ridsatp3@gmail.comకు 6-7-2024 లోపల Resume పంపగలరు.
ATA_Sathish

ఎగ్జిక్యూటివ్‌లు కావలెను
బుక్కరాయసముద్రం, బళ్ళారి, పాల్తూరు, హవళిగి, గుత్తి, రామగిరి, బత్తలపల్లి, పుట్లూరు పరిసర ప్రాంతాల్లో స్వరాజ్ ట్రాక్టర్స్‌కు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు ట్రాక్టర్ ఫీల్డ్‌లో 2 నుండి 10 సం॥ల అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. అర్హత ఏదేని డిగ్రీ. Cell: 8374559867,8465066566,7799133395.
AJA-189179

10th/Inter ఫెయిల్ ఫ్రీ ట్యూషన్స్
10th/Inter ఫెయిల్ ఫ్రీ ట్యూషన్స్, శేఖర్ కోచింగ్ సెంటర్, Opp: G.R. ఫంక్షన్ హాల్, 3వ రోడ్డు, A.T.P, హాస్టల్ వసతి కలదు. Cell:9440045441.
AJA-207

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి


పూలకుంటలో వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న టీడీపీ నాయకులు


కొట్నూరులో జేసీ అభిషేక్ కుమార్, తహసీల్దార్..


కొటిపిలో వాణ్యివిభాగ రాష్ట్ర అధ్యక్షుడు అరుణాచల్ రెడ్డి


పెనుకొండలో దివ్యాంగుడికి పింఛన్ అందిస్తూ

మురిపించేన..!


మిట్టమీదపల్లిలో చంద్రబాబుకు క్షీరాభిషేకం చేస్తున్న అభిమానులు


గోరంట్లలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు

ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, జూలై 1: రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా చేపట్టిన పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. సోమవారం హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పింఛన్ల పంపిణీలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

● ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాటతప్పారని రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమందేపల్లి మండల కేంద్రంలోని స్నేహలతనగర్‌లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. ఈ దిశలో జనం ఆమెకు ఘనస్వాగతం పలికారు. దారి పొడవునా పూలు వెదజల్లుతూ నీరాజనం పట్టారు. అనంతరం ఆమె పెన్షనర్లతో కలిసి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

● నిరుపేదల కళ్లలో ఆనందమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని హిందూపురం నియోజకవర్గ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరదేవి అన్నారు. నియోజకవర్గవ్యాప్తంగా పలు గ్రామాల్లో, మండలాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. వృద్ధులకు పంపిణీ చేస్తున్న రూ.7వేలు పింఛన్లను స్వయంగా ఆమె చేతులమీదుగా అందించారు.

● మాట తప్పడం, మడమ తిప్పడం మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అలవాటేనని ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం, మొదటి నెలలోనే ఎన్నికల హామీని అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామిలు అన్నారు. మడకశిర పట్టణ సమీపంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పింఛను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పట్టణంలో పింఛను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు అందించారు.

● ఆయా మండలాల్లో, గ్రామాల్లో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఉత్సాహంగా పాల్గొని పింఛన్ల పంపిణీ చేపట్టారు. వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందజేయడంతో తమకు పెద్ద కొడుకు రూపంలో చంద్రబాబు న్యాయం చేశారని హర్షం వ్యక్తం చేశారు.


చిలమత్తూరులో అభిమానుల సంబరాలు


అగళిలో ఎన్టీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


గుట్టూరులో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు


కోనాపురంలో...


మంగాపురంలో....


హిందూపురంలో పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు


వసుంధరాదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ బండారు శ్రీనాథ్

వసుంధరాదేవిని కలిసిన కుప్పం డీఎస్పీ

హిందూపురం, జూలై 1: హిందూపురం ఎన్‌బీకే ఫ్యాన్స్ బండారు బాలాజీ తనయుడు ప్రస్తుత కుప్పం డీఎస్పీ బండారు శ్రీనాథ్ నందమూరి వసుంధరాదేవిని కలిశారు. సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి విచ్చేసిన స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి సుంధరాదేవి పింఛన్ల పంపిణీలో పాల్గొనగా అక్కడికి వచ్చిన బండారు శ్రీనాథ్‌తోపాటు తండ్రి ఎన్‌బీకే ఫ్యాన్స్ నాయకుడు బాలాజీ కుటుంబ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్‌ను వసుంధరాదేవి అభినందించారు.

ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా రోహిల్ బాధ్యతల స్వీకరణ

హిందూపురం అర్బన్, జూలై 1: హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా సోమవారం రోహిల్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న లింగణ్ణ రోహిల్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రోహిల్ మాట్లాడుతూ హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధికి పాటుపడుతానన్నారు. వైద్యుల సహకారంతో సకాలంలో చికిత్స అందిస్తామన్నారు. వసుంధరదేవికి పుష్పగుచ్ఛం ఇస్తున్న రోహిల్



అమ్మమ్మా!

● పేరుకుపోయిన అమ్మ డెయిరీ బకాయిలు

రాప్తాడు: రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఏర్పాటు చేసిన అమ్మ డెయిరీ బకాయిలు రూ. రెండు కోట్లకు చేరాయి. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో పాడి రైతుల నుంచి ఏజెంట్లు పాలు సేకరించి అమ్మ డెయిరీకి సరఫరా చేస్తున్నారు. గత కొన్ని నెలల నుంచి ఏజెంట్లకు ఒక్కొక్కరికి అమ్మ డెయిరీ రూ.లక్షల్లో బాకీ పడుతూ వస్తోంది. ఏజెంట్లు మాత్రం అప్పులు చేసి గ్రామాల్లో రైతులకు బిల్లులు సకాలంలో అందచేశారు. ఇటీవల వెలువడిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైసీపీ ఘోర పరాజయం పొందిన నేపథ్యంలో అమ్మ డెయిరీ అతి త్వరలోనే మూత పడనుందని సమాచారం. డెయిరీ మేనేజర్లు పాలు పంపవద్దని ఇప్పటికే ఏజెంట్లకు చెబుతున్నారు. పాత బకాయిలు వసూలు చేయడం ఏజెంట్లకు సవాల్‌గా మారింది. ఏజెంట్లు ఎక్కువగా వైసీపీ మద్దతుదారులే ఉండటంతో బకాయిలు వస్తాయో రావో అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మహిళా సహకార డెయిరీ ఏర్పాటు చేస్తామని రాప్తాడు నియోజకవర్గంలో వేల మంది మహిళల నుంచి ఒక్కొక్కరితో రూ. 10 వేలు చొప్పున ప్రకాష్‌రెడ్డి వసూలు చేయించారు. ఇలా రూ. కోట్లలో వసూలు చేశారు. ఆ మొత్తాన్ని అప్పట్లో ప్రకాష్‌రెడ్డి సోదరులు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. మహిళల నుంచి వసూలు చేసిన మొత్తం ఏమైందని అప్పట్లో ప్రతిపక్ష నాయకులు గట్టిగా నిలదీయడంతో మూడేళ్ల తరువాత ఆ డబ్బును వెనక్కు ఇచ్చేశారు.

● ఏజెంట్లు తమకు రావాల్సిన బకాయిల కోసం తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. డెయిరీ దగ్గరికి వెలితే మేనేజర్ల నుంచి సరైన సమాధానం రాలేదు. కొన్నాళ్ల డెయిరీ చుట్టూ ఏజెంట్లు తిరిగారు. ఇటీవల దాదాపు 10 మంది ఏజెంట్లు డెయిరీ దగ్గరికి వెళ్లి అక్కడి నుంచి ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తి వెళ్లారు. ఆ సమయంలో ప్రకాష్‌రెడ్డి వాళ్ల నాన్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి ఇంట్లో ఉన్నారు. మా బిల్లులు రూ. లక్షల్లో బాకాయిలు ఉన్నాయి. వెంటనే ఇవ్వండి అని అడిగారు. ఎన్నికల్లో గెలిచి ఉంటే మీరు మమ్మల్ని బిల్లులు అడిగేవారా అని ఏజెంట్లపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

● బకాయి బిల్లుల కోసం ఏజెంట్లు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వద్దకు వెళ్లారు. డెయిరీ మేనేజర్‌ను పిలిపించి ఎవరెవరికి ఎంత బకాయి ఉన్నాం అని మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు. డెయిరీకి రావాల్సిన పాల సేల్స్ డబ్బులు వచ్చాక మీ బిల్లులు ఇస్తాం అని ఏజెంట్లకు తెలిపారు. అమ్మ డెయిరీకి పాల ప్యాకెట్ల సేల్స్ నుంచి రూ. 20 లక్షలు రావాల్సి ఉంది. ఏజెంట్లకు రూ. 2 కోట్లు బకాయిలు ఉన్నాయి. మిగతా మొత్తం ఎక్కడి నుంచి ఇస్తారన్నదే ఇప్పుడు అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. ఈ నేపథ్యంలోనే తమకు రావాల్సిన బకాయిలు వస్తాయో రావో అని ఏజెంట్లు భయాందోళన చెందుతున్నారు. ఈక్రమంలోనే ప్రకాష్‌రెడ్డి ఇంత మోసం చేస్తాడా అని భగ్గుమంటున్నారు.

● ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన ఓ ఏజెంట్‌కు రూ.18.50 లక్షలు, మరో ఏజెంట్‌కు రూ.20 లక్షలు, తలుపూరుకు చెందిన ఓ ఏజెంట్‌కు రూ.5.30 లక్షలు, వడ్డుపల్లికి చెందిన ఓ ఏజెంట్‌కు రూ.3.70 లక్షలు బకాయిలు రావాల్సి ఉంది.

● రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన ఓ ఏజెంట్‌కు రూ. 18 లక్షలు, మరో ఏజెంట్‌కు రూ. 9లక్షలు, యర్రగుంటకు చెందిన ఓ ఏజెంట్‌కు రూ. 5లక్షలు పైగా రావాల్సి ఉంది.

● అనంతపురం రూరల్ మండలం మన్నీలకు చెందిన ఓ ఏజెంట్‌కు రూ. 9 లక్షలు, పూలకుంటకు చెందిన ఓ ఏజెంట్‌కు రూ. 4లక్షలు రావాల్సి ఉంది.

ఆలమూరు సమీపంలోని అమ్మ డెయిరీ



ఉదయం సర్వర్ సతాయింపు

●సాయంత్రానికి 93శాతం పింఛన్ల అందజేత

హిందూపురం, జూలై 1: పల్లె, పట్నం తేడా లేకుండా సోమవారం ఉదయం నుంచే పండగ వాతావరణం నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ మొత్తం కలిపి సోమవారం ఇళ్లవద్దకే తీసుకెళ్లి పంపిణీ చేశారు. ఉదయం 6గంటలకే అధికారులు, సచివాలయ ఉద్యోగులు తెలుగుదేశంపార్టీ నాయకులు కలిసి వెళ్లి పింఛన్లు అందించారు.

మధ్యాహ్నం వరకు సర్వర్ సతాయింపు

ఉదయం 6గంటలకే పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించినా రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి ప్రారంభం కావడంతో మధ్యాహ్నం వరకు సర్వర్ సమస్య తలెత్తింది. ఆ తరువాత సమస్య పరిష్కారం కావడంతో సాయంత్రం 6గంటలు దాటేసరికి హిందూపురం నియోజకవర్గం వ్యాప్తంగా 93శాతం పింఛన్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు. కొన్నిచోట్ల పింఛన్‌దారులు పొలాల్లో ఉండగా పింఛన్ మొత్తాన్ని అందించారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

హిందూపురం(సోమందేపల్లి), జూలై 1: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో సోమవారం స్టాప్ డయేరియాపై అవగాహన కార్యక్రమం వైద్యాధికారులు ప్రారంభించారు. డయేరియాను అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానంపై సచివాలయాలు, అంగనవాడీ పాఠశాలలు అవగాహన కల్పించారు. బ్యానర్లు, పోస్టర్లు ఆవిష్కరించి డయేరియాను అరికట్టేదిశలో చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. జూలై 1నుంచి ఆగస్టు 2వరకు కార్యక్రమం కొనసాగుతుందని వైద్యాధికారి హరీష్‌కుమార్ తెఎలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యుడు ఓంకార్, సీహెచ్‌ఓ మనోహర్‌రెడ్డి, సూపర్‌వైజర్ రవీంద్ర, ఫార్మసిస్ట్ ప్రభాకర్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ కార్యకర్తల దాడి

హిందూపురం, జూలై 1: టీడీపీ నాయకుడిపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. పరిగి మండలం జంగాలపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త బాలాజీపై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు గత వైసీపీ పాలనలో తన కుటుంబాన్ని వైసీపీ నాయకులు తీవ్రంగా వేదించారన్నారు. ఆరేడుసార్లు తనపై కేసులుపెట్టారన్నారు. తన తప్పు లేకపోయినా పోలీసులు తనను ఇబ్బందులకు గురి చేశారు. అయితే తెలుగుదేశం పరిపాలనలోకి వచ్చిందన్న అక్కసుతో గత నెల 4వ తేదీ నుంచి కూడా గ్రామంలో తనపై విమర్శలు చేస్తున్నారు. సోమవారం పింఛన్లు పంపిణీ చేస్తుండగా గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు ఆంజనేయులు, తిప్పన్న, నరసింహులు కర్రతో దాడిచేశారన్నారు. దీంతో తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎస్ఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేశాడు. వైసీపీ నాయకుడిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి ఇంట్లో చోరీ


ఉద్యోగి ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

హిందూపురం(సోమందేపల్లి), జూలై 1: మండల కేంద్రంలోని షిర్డీసాయి నగర్‌లో నివాసం ఉంటున్న బ్యాంక్ ఉద్యోగి మహేష్ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. స్థానిక కెనరాబ్యాంక్ నందు ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న మహేష్ ఇటీవలే విధుల్లో చేరాడన్నారు. షిర్డీనగర్‌లో ఇల్లు బాడుగకు తీసుకుని అందులో నివాసం ఉంటున్నాడన్నారు. ఆదివారం సెలవు కావడంతో కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వెళ్లి రాగా ఇంట్లో చోరీ జరిగినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. దుండగులు ఇంటి తలుపు పగలకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో సీసీ టీవీ హార్డ్‌డిస్క్, మానిటర్, రెండు వాచ్‌లు, వెండి వస్తువులు, దొంగలించినట్లు గుర్తించామని ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 1: మండలంలోని బూడిదగడ్డపల్లికి చెందిన వెంకటేష్ కుటుంబ కలహాల కారణంగా విషద్రావకం తాగి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బూడిదగడ్డపల్లికి చెందిన వెంకటరామప్పకుమారుడు వెంకటేష్ కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురై విషద్రావకం సేవించి అస్వస్తత పొందారు. కుటుంబ సభ్యులు వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా, డాక్టర్ ఉషా చికిత్సలు చేశారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

నూతన చట్టాలపై పోలీసుల అవగాహన

అగళి, జూలై 1: కేంద్రం నూతనంగా ప్రవేశపెట్టిన చట్టాలపై పోలీసులు అవగాహక కల్పించారు. అక్రమ కేసులకు పాల్పడవద్దని శిక్ష పెద్దగా ఉంటుందని అగళి ఎస్ఐ వీరేష్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో నూతన చట్టాలపై సోమవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఐపీసీ 1860 క్రైమ్ పీసీ 1973చట్టం ఇండియన్ ఎంవైవర్మెంట్ యాక్ట్ 1872 ప్రకారం ప్రతి కేసులో కూడా ఎవరైనా అక్రమాలకు, అన్యాయాలకు పాల్పడితే ఐదు సంవత్సరాల నుంచి పది, 15సంవత్సరాల జైలుశిక్ష ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జూలై 1నుంచి ఈ నూతన చట్టాలు అమలులోకి వచ్చాయని వీటిని దృష్టిలో ఉంచుకుని మీరు మెలగాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. తాస్కారం చేయకుండా ఉండాలన్నారు. జూదం, గంజాయి, అక్రమ మద్యం, రోడ్డు ప్రమాదాలు గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు, 18సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులు వాహనం నడిపితే శిక్షలు తప్పవన్నారు. వీటన్నింటికి కూడా కేసు నమోదైతే శిక్షలు పడడం సత్యమన్నారు. మీరుకూడా గ్రామాలలో మీ తల్లిదండ్రులకు ఇతరులకు తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రామస్థులకు నూతన చట్టాల్లో విధివిధానాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ బషీర్, కానిస్టేబుల్ రాజన్న, శివ, అనీల్‌కుమార్, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

గోరంట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాల గురించి గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో సోమవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పాత చట్టంలోని లొసుగుల కారణంగా సాక్ష్యాధారాలు లేక కేసులు వీగిపోయేవని సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. వీడియో గ్రఫీ, పోటో గ్రఫీ ద్వారా ప్రతిష్టాత్మకంగా పాత చట్టాల స్థానంలో కొత్తచట్టాలు మార్పు చేశారన్నారు. ఈకార్యక్రమంలో ఎఎస్ఐలు మద్దిలేటి, ధనుంజయరెడ్డి, ప్రజలు, పోలీసులున్నారు.

గుడిబండ: గుడిబండ పోలీస్ స్టేషన్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన చట్టాలపై ప్రజలకు సోమవారం డీఎస్పీ బాజీజాన్ సైదా అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ మునిప్రతాప్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం(పరిగి) : పరిగి పోలీస్ స్టేషన్‌లో కేంద్రం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. సోమవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ 1867లో బ్రిటీష్ కాలంలో ప్రవేశపెట్టిన చట్టాలను తొలగించి 2024జూలై 1 నుంచి భారత రాజ్యాంగ ప్రభుత్వం కొత్తచట్టాలను అమలులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

పెనుకొండ టౌన్, జూలై 1: పది నెలల పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సవితకు వినతిపత్రం అందించారు. సోమవారం మంత్రి స్వగృహంలో పరిగి మండలానికి చెందిన కార్మికులు వ్రాతపూర్వకంగా వినతిని అందించి వారి గోడును వెళ్లగక్కారు. 11నెలల అరియర్స్, నూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వలేదని ఇప్పటికైనా ఇవ్వాలని కోరారు. రెండు నెలల నుంచి సర్పంచ్, కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోలేదని తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

రైతు సంఘాలను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

గుడిబండ, జూలై 1: రైతులను మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో పెనుకొండ డీఎస్పీ బాజీజాన్‌సైద మాట్లాడుతూ రైతులకు ఎఫ్‌బీఓ ద్వారా అందించిన వ్యవసాయ వలసమణి నూర్పిడి యంత్రాలను లీజుకు తీసుకుని యంత్రాలు తిరిగి ఇవ్వకుండా, వాటికి బాడుగ ఇవ్వకుండా మోసం తిమ్మరాజు అనే వ్యక్తి మోసం చేశాడని తెలిపారు. నిందితుడి నుంచి 14 వ్యవసాయ యంత్రాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.70లక్షలు ఉంటుందన్నారు. నిందితున్ని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండుకు ఆదేశించినట్లు డీఎస్పీ తెలిపారు. వీరివెంట ఎఎస్ఐ చంద్రశేఖర్, ఎస్‌హెచ్‌ఓ ప్రకాశ్, కానిస్టేబుళ్లు మహ్మద్ రఫీక్, వెంకటేశ్, హరినాథ్, భాస్కర్, శివానంద, నరేష్, పాతన్న, హోమ్‌గార్డ్ చంద్రశేఖర్, రామప్ప, ఉమేష్, జగన్నాథ్‌నాయక్ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును
మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్రదించండి 7382114647
AJA- 189272

SALE/RENTAL
6.30 Acers Of LAND WITH 26000 SQFT AREA SHED AVAILABLE WITH COMPOUND WALL. NEXT TO BANGALORE - HINDUPUR, MAIN ROAD, HINDUPUR(M) Contact:9347064164.
AJA-189266

ఎగ్జిక్యూటివ్‌లు కావలెను
బుక్కరాయసముద్రం, బళ్ళారి, పాల్తూరు, హావళిగి, గుత్తి, రామగిరి, బత్తలపల్లి, పుట్లూరు పరిసర ప్రాంతాల్లో స్వరాజ్ ట్రాక్టర్స్‌కు సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు ట్రాక్టర్ ఫీల్డ్‌లో 2 నుండి 10 సం॥ల అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను. అర్హత ఏదేని డిగ్రీ. Cell: 8374559867,8465066566,7799133395.
AJA-189179

GOLDEN OPPORTUNITY
Insurance Agents and Sale Managers
మీ స్వంత సేల్స్ టీం ని నియమించుకొని బిజినెస్ అభివృద్ధి చేసుకోండి మరియు ఆకర్షణీయమైన జీతంతో పాటు పెట్టుబడి లేకుండా వ్యాపారవేత్తగా మారే అవకాశం. సంప్రదించండి : అలెగ్జాండర్ లగ్జరీ హోటల్, సప్తగిరి సర్కిల్, అనంతపురము. ఇంటర్వ్యూ : తేది : 4 జూలై, 2024, మధ్యాహ్నం: 3 గం॥లకు. Register your Seat : 6364301913.
AJA-SREE

WANTED
HIV/ AIDS Prevention Project APSACS - RIDS Anantapur PU లో పనిచేయుటకు అభ్యర్థి కావలెను. M&E మానిటరింగ్ మరియు ఎవాల్యుయేషన్ ఆఫీసు కమ్ అకౌంటెంట్‌గా చేయుటకు అభ్యర్థి కావలెను. అర్హత: B.Com కంప్యూటర్, Graduation in Mathematics, Statistics & Commerce. Email ID: ridsatp3@gmail.comకు 6-7-2024 లోపల Resume పంపగలరు.
ATA_Sathish

10th/Inter ఫెయిల్ ఫ్రీ ట్యూషన్స్
10th/Inter ఫెయిల్ ఫ్రీ ట్యూషన్స్, శేఖర్ కోచింగ్ సెంటర్, Opp: G.R. ఫంక్షన్ హాల్, 3వ రోడ్డు, A.T.P; హాస్టల్ వసతి కలదు. Cell:9440045441.
AJA-207

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి